## అరుంధతి మండపానికి నిధులు మంజూరు చేయాలి



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

కేశవపట్నంలో మధ్యలో నిలిచిపోయిన అరుంధతి కళ్యాణ మండపం పూర్తి చేసేందుకు రూ.కోటి 50 లక్షల నిధులు మంజూరు చేయాలని దళిత సంఘాల జేఏసీ నాయకులు మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కోరారు. సోమవారం మండపంలో విలేకరులతో మాట్లాడిన వారు, 2021లో అప్పటి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఎకరా 10 గుంటల స్థలం కేటాయించి రూ.50 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. మరో రూ.10 లక్షలు మంజూరైనా ఎన్నికల కోడ్ కారణంగా రద్దయ్యాయని పేర్కొన్నారు. అసంపూర్తిగా ఉన్న మండపం ప్రస్తుతం పశువుల పాకగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు కళ్యాణ మండపాల్లో దళిత కుటుంబాల వివాహాలకు రూ.లక్ష వరకు ఖర్చవుతున్నందున, మండపం నిర్మాణం పూర్తయితే ఆర్థిక భారం తగ్గుతుందని తెలిపారు.
ఎమ్మెల్యే చొరవ తీసుకుని వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో అంశాన్ని చర్చించి 15 రోజుల్లో నిధుల మంజూరుకు చర్యలు చేపట్టాలని కోరారు. దళిత సంఘాల జేఏసీతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించి, అధికారులతో ప్రతిపాదనలు సిద్ధం చేయించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బొజ్జ రవి, పులికోట రమేష్, అరెపెల్లి ఓదెలు, క్యాదాసి భాస్కర్, నేలవేణి మహేష్, దాసరపు భద్రయ్య, మోరే శ్రీనివాస్, కనకం శంకర్, అంతడుపుల సతీష్, కొంద్ర రాజయ్య, తదితరులు పాల్గొన్నారు



## రోడ్డు పక్కన చికెన్ వ్యర్థాలు వేస్తున్నారని ఫిర్యాదు

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

కేశవపట్నం-మక్త గ్రామాల మధ్య రోడ్డు పక్కన చికెన్ వ్యర్థాలు, కుళ్లిన కూరగాయలు వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మక్త సర్పంచ్ నేలవేణి మహేష్ కోరారు. సోమవారం శంకరపట్నం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. కేశవపట్నంలోని చికెన్ సెంటర్ నిర్వాహకులు చికెన్ వ్యర్థాలను రోడ్డు పక్కన వేస్తున్నారని, కూరగాయల వ్యాపారులు కుళ్లిన కూరగాయలను అక్కడే పడేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వాటిని కుక్కలు, కోతులు తిని రోడ్డుపై వెళ్తున్న వారిపై దాడి చేసి గాయపరుస్తున్నాయని తెలిపారు. రోడ్డు పక్కన వ్యర్థాలు వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు.

## ఆరు గ్యారంటీలు అమలు చేయాలి



- **బీజేపీ రాష్ట్ర నాయకురాలు సోమారపు లావణ్య**

**శెనార్తి మీడియా, రామగుండం:**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు సోమారపు లావణ్య డిమాండ్ చేశారు. బీజేపీ వారం రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం రామగుండం కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో మేయర్ మహంకాళి స్వామితో పాటు కార్పొరేటర్లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తవుతున్నా ఎన్నికల హామీల్లో అనేకం అమలు కాలేదని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటూ ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ప్రజాకంటక పాలన సాగిస్తోందని విమర్శించారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుని ఆరు గ్యారంటీలు, 420 హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం హామీల అమలులో విఫలమైతే ప్రజా ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం మేయర్ మహంకాళి స్వామి, 12వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ బాబు మియా, 23వ డివిజన్ కార్పొరేటర్ బెంద్రం సునీత రెడ్డి, 42వ డివిజన్ కార్పొరేటర్ పాతిపల్లి కావ్య, 44వ డివిజన్ కార్పొరేటర్ కల్రవుల డేవిడ్ రాజులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు సోమారపు అరుణ్, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి మామిడి రాజేష్, జిల్లా ఉపాధ్యక్షురాలు మాతంగి రేణుక, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు సుజనా శ్రీ, చల్లా శోభారెడ్డి, దాసరి శ్రీనివాస్, మారేపల్లి శ్రీనివాస్, బూడిద రమేష్, అంకం తిరుపతి, పంగ రవి, పొట్ల రవి, అరిగెల శ్రావణ్, మెరుగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## హుజూరాబాద్‌లో కార్గో సేవలు ప్రారంభం



శెనార్తి మీడియా, హుజూరాబాద్: హుజూరాబాద్ బస్టాండ్‌లో ఆర్టీసీ కార్గో సెంటర్‌ను సోమవారం డీఎం వి. రవీంద్రనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల ద్వారా వివిధ రకాల వస్తువులను కార్గో సెంటర్ల నుంచి రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు సురక్షితంగా రవాణా చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, వ్యాపారులు ఆర్టీసీ అందిస్తున్న కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ ఏంజెల్, కార్గో ఏజెంట్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కేశవపట్నం బస్టాండ్‌లో గుంతలు పూడ్చివేత



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

కేశవపట్నం బస్టాండ్ ఆవరణలో ఏర్పడిన నీటి గుంతలను గ్రామపంచాయతీ సిబ్బంది సోమవారం పూడ్చివేశారు. సర్పంచ్ గోదారి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో గుంతలను మట్టితో పూడ్చి బస్టాండ్ ప్రాంగణాన్ని చదును చేశారు. వర్షాల కారణంగా నీరు నిలిచి ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యానికి ప్రాధాన్యత ఇస్తూ బస్టాండ్ పరిసరాల్లో అవసరమైన అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి నరసయ్య, ఉపసర్పంచ్ ఆకుబత్తిని విజయకుమార్, బస్టాండ్ గైడ్ హనుమంతరావు, సెక్యూరిటీ హరి మ్యాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తాడికల్‌లో ఘనంగా మడేలయ్య బోనాలు



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

తాడికల్ గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో శ్రీ మడేలయ్య బోనాల ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. రజక సంఘం అధ్యక్షుడు పాంద్రాల మహేష్ ఆధ్వర్యంలో మహిళలు మడేలయ్య బోనాలను ఎత్తుకొని డీజే, డప్పు, జముడిక దరువులతో గ్రామంలోని వాడవాడలా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి జాతర ఉత్సవాలను వైభవంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ, టీపీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, గ్రామ సర్పంచ్ దుర్గపు సుజాత తిరుపతి, తాడికల్ సహకార సంఘం చైర్మన్ కీసర సంపత్, వార్డు సభ్యులు, సహకార సంఘం పాలకవర్గ సభ్యులు, రజక సంఘం నాయకులు, రజకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పౌర హక్కులపై అవగాహన

**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

పౌరులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, కుల వివక్షత నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పాక్స్ డైరెక్టర్ బైర సంతోష్ సూచించారు. దాచారం గ్రామంలో సోమవారం పౌర హక్కులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ సంతోష్ మాట్లాడుతూ ప్రజలంతా సామరస్యంగా కలిసి మెలిసి ఉండాలని, సమాజంలో ఎవరి హక్కులకు భంగం కలిగించరాదని సూచించారు. హక్కులకు భంగం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు గ్రామంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్, జీపీఓ సమ్మయ్య, పోలీస్ కానిస్టేబుల్ వసీం, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.



## బెజ్జంకిని కరీంనగర్‌లో కలపాలి

**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

బెజ్జంకి మండలాన్ని కరీంనగర్ జిల్లాలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి ప్రవీణ్‌కు వినతిపత్రం అందజేశారు. మండల ప్రజల పరిపాలనా, రవాణా సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని బెజ్జంకిని కరీంనగర్ జిల్లాలో కలపాలని సీపీఐ డిమాండ్ చేస్తోందని మండల కార్యదర్శి బోనగిరి రూపేష్ తెలిపారు. కార్యక్రమంలో దొంతరవేణి మహేష్, బోనగిరి శ్రవణ్, ప్రశాంత్, అంజి పాల్గొన్నారు.

## చీలాపూర్‌లో రేషన్ కార్డుల పంపిణీ



**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

మండలంలోని చీలాపూర్ లో స్మార్ట్ రేషన్ కార్డులను స్థానిక పంచాయతీ కార్యాలయంలో లబ్ధిదారులకు సర్పంచ్ ఎర్రవెల్లి శ్రీనివాస్ సోమవారం పంపిణీ చేశారు. ప్రజలు గ్రామపంచాయతీకి వచ్చి తమ రేషన్ కార్డులను తీసుకువెళ్లాలని కోరారు. లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రభుత్వ పథకాలు మరింత సులభంగా అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాయమల్లు, పంచాయతీ

## బాధిత కుటుంబానికి శరత్ రావు పరామర్శ



**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

మండలంలోని తోటపల్లి గ్రామానికి చెందిన ఏనుగుల ఐలయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తన్నీరు శరత్‌రావు సోమవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ బోయినపల్లి నర్సింగరావు, నల్లగొండ నర్సయ్య, వార్డు సభ్యులు మడ్డి సందీప్, ఉల్లి నరేష్, అమ్మిగల్ల సురేష్, కొన్నే అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## రసమయి వ్యాఖ్యలపై యువజన కాంగ్రెస్ ఆగ్రహం



**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

గన్నేరువరం మండలకేంద్రంలో ఆదివారం నిర్వహించిన మాదక ద్రవ్యాల నిరోధక ర్యాలీలో పాల్గొన్న యువజన కాంగ్రెస్ నాయకులపై మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు యువజన కాంగ్రెస్ నాయకులు తెలిపారు. మండల అధ్యక్షుడు కర్రావుల సందీప్ ఆధ్వర్యంలో బెజ్జంకి మండలకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడు అట్ల అనిల్ మాట్లాడారు. తాము డ్రగ్ టెస్ట్‌లకు సిద్ధంగా ఉన్నామని, సెప్టెంబర్ 7న బెజ్జంకిలో జరిగే కార్యక్రమానికి ర్యాపిడ్ డ్రగ్ టెస్ట్ కిట్లతో వస్తామని చెప్పారు. ప్రజల సమక్షంలోనే పరీక్షలు చేయించుకోవడంతో పాటు పరీక్షా నివేదికలను ప్రజల ముందుంచేందుకు సిద్ధంగా ఉన్నామని, డ్రగ్ టెస్ట్‌కు బహిరంగ సవాల్ విసురుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మానకొండూరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శానగొండ శరత్ కుమార్, తిమ్మాపూర్ మండల అధ్యక్షుడు కర్ర మణికంఠ, శ్రీకాంత్, మహేందర్, రవి, రాగటి అంజి, చుక్క హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## బెజ్జంకిలో 30 పడకల ఆసుపత్రి నిర్మించాలి



**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

బెజ్జంకి మండలంలో 30 పడకల ఆసుపత్రి నిర్మించడంతో పాటు బెజ్జంకి, తోటపల్లి పీహెచ్‌సీల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ మాట్లాడుతూ.. బెజ్జంకి, తోటపల్లి పీహెచ్‌సీల్లో సిబ్బంది కొరతతో వైద్యం కోసం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బెజ్జంకి పీహెచ్‌సీలో సూపర్‌వైజర్, ముగ్గురు స్టాఫ్ నర్సులు, నలుగురు ఏఎన్ఎంల పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఆయుష్‌కు చెందిన ఇద్దరు అధికారులను సిద్దిపేటకు డిప్యూటేషన్‌పై పంపారని తెలిపారు. తోటపల్లి పీహెచ్‌సీలో ఫార్మాసిస్టు, స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వైద్యాధికారికి కూడా వినతిపత్రం అందజేశామని తెలిపారు. బెజ్జంకిలో 30 పడకల ఆసుపత్రి నిర్మించి పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు బొమ్మిడి సాయికృష్ణ, సంఘ ఎల్లయ్య, బోనగిరి లింగం, బోనగిరి పరశురాములు, కుంట సత్తయ్య, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

